క్లుప్తంగా

కుంకుమేశ్వరాలయంలో నేడు విగ్రహ స్థాపన మహోత్సవం

పరకాల : పట్టణంలో ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో నేడు (శుక్రవారం) పునర్మహారందీశ్వర విగ్రహ స్థాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ దాత, 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విగ్రహ స్థాపన అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

వాగులో పడి వ్యక్తి మృతి

కమలాపూర్ : మండలంలోని గూనిపర్తికి చెందిన సామంతుల శ్రీనివాస్ (45) ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఈనెల 1న బహిర్భూమికని చెప్పి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. గురువారం గ్రామ శివారులో వాగు వెంట వెతుకుతుండగా శ్రీనివాస్ మృతదేహం వాగులోని నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కమలాపూర్ : మండలంలోని కన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాములపల్లికి చెందిన బచ్చల లక్ష్మయ్య అనే వృద్ధునికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. లక్ష్మయ్య గురువారం తన ఇంట్లో మంచంపై పడుకుని బీడీ అంటించుకుంటుండగా ప్రమాదవశాత్తు చెద్దరుకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య గాయాలపాలయ్యాడు. 108 ఉద్యోగులు ఈఎంటీ ఉపేందర్, పైలట్ సందీప్ వృద్ధుడిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా వృద్ధుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామంలోని మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ) స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం) రాయరాకుల పరమేశ్వర్ పర్యవేక్షణలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఉత్సాహంగా పాఠాలు బోధించారు. ఎంఈఓగా షేక్ అబ్దుల్ కరీం, హెచ్‌ఎంగా సుదినబోయిన సాత్విక, ఉపాధ్యాయులుగా మరో 20 మంది వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్పంచ్ కత్తి దేవేందర్, దాత పిన్నింటి గోపాల్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మామునూరు కుమారస్వామి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంత, యాకయ్య, కొంరయ్య, ఇందిర, స్వప్న, నరేందర్, అంగన్‌వాడీలు నిర్మల, విమల, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న డీబీఎఫ్ నాయకులు

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, అక్కంపేట, నాగయ్యపల్లె, పెద్దాపూర్, అగ్రంపహాడ్ గ్రామాల్లో దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు సంబంధించి అర్హులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ మాట్లాడారు. దళితులు దశాబ్దాలుగా అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్నా పట్టాల్లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టాలు ఇచ్చే దిశగా చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. మండలంలో అన్యాక్రాంతం అవుతున్న పేదల, ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. పేదలకు పట్టాలు ఇప్పించడంతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరు భిక్షపతి, నాయకులు ప్రసంగి, రాజు, వైఎస్సార్‌టీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జింక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ ఎన్నికలు ప్రశాంతం

● 76 శాతం పోలింగ్


విజేతలకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గురువారం నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 76 శాతం ఓటింగ్ నమోదైంది. ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. తొలుత మందకొడిగా కొనసాగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు గడువు కాగా 12.30 గంటలకు సుమారు 300 మంది ఓటర్లు ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి రాగా వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి ఓటర్లకు టోకెన్లు అందజేసి రెండు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. సొసైటీలో 1166 మంది ఓటర్లుండగా 886 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 76 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో 823 ఓట్లు చెల్లుబాటు కాగా 63 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. ఎన్నికలకు పరకాల ఏసీపీ శివరామయ్య ఆధ్వర్యంలో పరకాల సబ్ డివిజన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

9 మంది డైరెక్టర్ల ఎన్నిక

సొసైటీ ఎన్నికలో 39 మంది అభ్యర్థులు బరిలో నిలువగా డైరెక్టర్లుగా 9 మంది ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గండి రాజమౌళి, ఐరబోయిన రాజు, కుక్కల తిరుపతి, ఐరబోయిన తిరుపతి, పల్లెబోయిన భాస్కర్, కుక్కల ఆనంద్, అన్నబోయిన శంకర్, పల్లెబోయిన సురేష్‌కుమార్, మోరే నరేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి ప్రకటించారు.

పోలింగ్ బూత్‌కు తాళం వేసిన అజ్ఞాత వ్యక్తి

పెద్దకోడెపాకలో మత్స్య సొసైటీ పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించనుంగా రైతు వేదికకు గుర్తు తెలియని వ్యక్తి తాళం వేశాడు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు, పోలీసు సిబ్బంది ఉదయం 6 గంటలకు చేరుకోగా పీఏసీఎస్ సిబ్బంది వేసిన తాళంతోపాటు మరొక తాళం వేసి గొలుసులతో బంధించి మరో తాళం వేసి ఉంది. పోలీసు, ఎన్నికల అధికారులు తాళం


రైతువేదికకు మరొక తాళం వేసిన దృశ్యం

వేయలేదని నిర్ధారించాక ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందితో తాళం పగలగొట్టి ఎన్నికలు నిర్వహించారు.


పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శివరామయ్య

నేడు పాలకవర్గం ఎన్నిక

మండలంలోని పెద్దకోడెపాక మత్స్య సొసైటీ పాలకవర్గ ఎన్నికను గ్రామంలోని రైతువేదికలో నేడు (శుక్రవారం) ఉదయం 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన 9 మంది అభ్యర్థులు ఉదయం 8.30 గంటల వరకల్లా రైతువేదికకు చేరుకోవాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. డైరెక్టర్ స్థానాల కోసం ఒకరికి మించి నామినేషన్లు వేస్తే ఎన్నిక ఉంటుందని, ఒక్కరే నామినేషన్ వేస్తే ఏకగ్రీవంగా ప్రకటిస్తామని తెలిపారు.

రూ.500 కోట్లతో ఆర్థిక లావాదేవీలు

● సహకార వికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద


మాట్లాడుతున్న జయప్రద

భీమదేవరపల్లి : ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో పురుషుల, మహిళ పొదుపు సంఘాలు రూ.500 కోట్లతో ఆర్థిక లావాదేవీలు సాగిస్తున్నట్లు సహకార వికాస సంస్థ అధ్యక్షురాలు కాసర్ల జయప్రద తెలిపారు. మండలంలోని ముల్కనూర్ పురుషుల పొదుపు సమితి 23వ వార్షిక మహాసభ గురువారం నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. మూడు జిల్లాల్లో 320 మహిళ, 230 పురుష పొదుపు సంఘాల్లో 2.50 లక్షల మంది సభ్యులున్నట్లు తెలిపారు. ఒక్కో సభ్యుడికి గరిష్ఠంగా రూ.2.50 లక్షల వరకు అప్పు ఇస్తున్నామని చెప్పారు. తాకట్టు లేకుండా ఇస్తున్న రుణాలకు కేవలం 75 పైసల వడ్డీ మాత్రమే పడుతోందన్నారు. గతంలో రుణాల కోసం ప్రజలు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉండగా ప్రస్తుతం గ్రామాల్లో సంఘాల ఆవిర్భావం తర్వాత రుణాలు పొందడం సులభంగా మారిందని వివరించారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి సంఘాల బలోపేతానికి సహకరించాలని సూచించారు. మహాసభలో సమితి అధ్యక్షులు జాన ప్రవీణ్, గాజుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


సీఐని సన్మానిస్తున్న నాయకులు, ఆటోడ్రైవర్లు

ధర్మసాగర్ : ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఒంటేరు రమేష్ కోరారు. మండలంలోని తాటికాయల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఆటో యూనియన్ బోర్డును గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకెళ్లొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వాహనానికి సంబంధించి లైసెన్స్‌తోపాటు ఇతర అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని, ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలని సూచించారు. సీఐ రమేష్‌కు ఆటోడ్రైవర్లు పూలబొకే అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ ఆటో యూనియన్ అధ్యక్షుడు కనుకటి రవీందర్, ఉపాధ్యక్షుడు పెసరు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజు, జాయింట్ సెక్రటరీ పెసరు యాదగిరి, కోశాధికారి కమాలొద్దీన్, డ్రైవర్లు శంకర్, రజనికుమార్, అనిల్, రమేష్, షకీల్, నీల యాదగిరి, రవితేజ, బత్తిని రాజేష్, జోగు యాదగిరి, నల్ల ప్రసాద్, పట్ల సురేష్, ఆశీర్వాదం, చెక్కిళ్ల రవి, నల్ల రఘు, పట్ల అభిరాం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై పోరాడతాం

● బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎల్తూరి శ్రీనివాస్

పరకాల : గ్రామాల అభివృద్ధి, సర్పంచ్‌ల సమస్యలపై పోరాడతామని బీఎస్పీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్తూరి శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం మండలంలోని వెల్లంపల్లి గ్రామాన్ని గురువారం సందర్శించింది. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి ఆటంకాలు, సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులపై బృందం అధ్యయనం చేసింది. అనంతరం ఎల్తూరి శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల సమగ్రాభివృద్ధిని, సర్పంచ్‌ల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. తద్వారా గ్రామాల అభివృద్ధి, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల అసెంబ్లీ కమిటీ ఉపాధ్యక్షుడు మహ్మద్ అమ్జద్‌పాషా, మండల అధ్యక్షుడు పెండెల మహేందర్, డీఎస్పీ నాయకుడు చంద్ర తరుణ్ పాల్గొన్నారు.

'కేంద్ర' తప్పుడు విధానాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న జన్ను దినేష్

దామెర : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మోసపూరిత విధానాలను తిప్పికొట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ కోరారు. మాదిగ సంగ్రామ యాత్ర మండల కేంద్రానికి గురువారం చేరుకోగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాదిగ, ఉపకులాల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను, ఉపకులాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల మాదిగ, ఉపకులాల ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈనెల 15న హైదరాబాద్‌లో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో మాదిగ, ఉపకులాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజు, గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతిసాగర్, గోవిందు రవి కుమార్, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు పాల్గొన్నారు.

విలేకరిని దూషించిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : ఓ పత్రిక విలేకరిని దూషించిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ కుమార్ తెలిపారు. మండలానికి చెందిన ఓ విలేకరి తనను కాంట్రాక్టర్ రమేష్ దూషించాడని ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు. విచారణ చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

భీమదేవరపల్లి : మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఐబీ డీఈఈ సుధాకర్ సూచించారు. మండలంలోని ముల్కనూర్, కొత్తపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో 15 పాఠశాలలు మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఎంపికైనట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించడంతోపాటు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట ఐబీ ఏఈ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నాగరాజు, ముల్కనూర్ సర్పంచ్ మాడ్గుల కొంరయ్య, పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ ఉన్నారు.

మాణిక్‌రావు థాక్రేకు ఘనసన్మానం


మాణిక్‌రావు థాక్రేను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు : టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రేను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా సన్మానించారు. ములుగు నుంచి హనుమకొండకు వెళ్తుండగా ఆయన మండల కేంద్రంలో ఆగి శ్రేణులతో మాట్లాడారు. మండలంలో రాజకీయ పరిస్థితులపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి శ్రేణులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ ఆధ్వర్యంలో ఆత్మకూరు, దామెర మండలాల నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ దామెర మండల అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ పూజారి రాము, నాయకులు అలువాల రవి, ముద్దం సాంబయ్య, జిన్నా వెంకన్న, వెల్దె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జార్జ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఓపెన్ జిమ్ ప్రారంభం


జిమ్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని రిజర్వాయర్ (చెరువు) వద్ద ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ త్వరలోనే ప్రారంభం అవుతుందని సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ తెలిపారు. జిమ్ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా భావించాలని సూచించారు. తద్వారా ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకోవాలని కోరారు. జిమ్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

పీఆర్సీ విడుదలలో జాప్యం సరికాదు

● ఎన్పీడీసీఎల్ జేఏసీ కన్వీనర్ సామ్యనాయక్


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

కమలాపూర్ : విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ విడుదల చేయడంలో జాప్యం చేయడం సరికాదని ఎన్పీడీసీఎల్ జేఏసీ కన్వీనర్ సామ్యనాయక్ అన్నారు. వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీఆర్సీ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సామ్యనాయక్ మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు నాలుగేళ్లకోసారి పీఆర్సీ ఇవ్వాల్సి ఉందన్నారు. గతేడాది ఏప్రిల్‌లోనే పీఆర్సీ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు 11 నెలలు ఆలస్యమైనా పీఆర్సీ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే పీఆర్సీ విడుదల చేయాలని, విద్యుత్ ఉద్యోగులను ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరమణ, ఏడీలు పైడయ్య, సురేష్, రాజు, దేవేందర్, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు ఉద్యోగుల బాధ్యత


పూర్ణచందర్‌ను సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు, అధికారులు

భీమదేవరపల్లి : ప్రజలకు మెరుగైన సేవలు అందించడాన్ని ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యతగా ముల్కనూర్ సర్పంచ్ మాడ్గుల కొంరయ్య అభివర్ణించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించడం ద్వారానే వారికి గుర్తింపు లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ ఇటీవల ఉత్తమ కార్యదర్శిగా అవార్డు అందుకోగా మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయన్ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొంరయ్య మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏ స్థాయిలో ఉన్నా విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఉద్యోగులు సమర్థవంతంగా పని చేస్తేనే పల్లెలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని తెలిపారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందడం సహజమన్నారు. తొలుత వీరభద్రస్వామి ఆలయంలో పదోన్నతి పొందిన మొగిలిపాలెం రాంబాబును సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఐబీ డీఈఈ సుధాకర్, ఏఈ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నాగరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి సురేందర్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం

● బీజేపీ శ్రేణుల సంబురాలు.. విజయోత్సవ ర్యాలీ


స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

పరకాల : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ పరకాల రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. దేశంలోని 3 ఈశాన్య రాష్ట్రాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా పట్టణంలో గురువారం సంబురాలు నిర్వహించారు. తొలుత విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్లే ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజలు గెలిపించారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్లు ఆర్పీ.జయంత్‌లాల్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, నాయకులు మేకల రాజవీర్, గాజుల నిరంజన్, కుక్కల విజయ్‌కుమార్, పిట్ట వీరస్వామి, దంచనాల సత్యం, ఆకుల రాంబాబు, పాలకుర్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు మండలాల్లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఖాళీ సిలిండర్లతో మహిళలు ధర్నా చేశారు.


కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర రూ.50 పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు పూజారి రాము, అలువాల రవి, రేవూరి జయపాల్‌రెడ్డి, ముద్దం సాంబయ్య, బీరం రజనీకర్‌రెడ్డి, వెల్దె వెంకటేశ్వర్లు, జిన్నా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


దామెర : నిరసన తెలుపుతున్న నాయకులు, ప్రజలు

గ్యాస్ ధర పెంపు దుర్మార్గం

దామెర : వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం దుర్మార్గమని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబి స్తోందని విమర్శించారు. గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడిపై భారం మోపిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంబి సాంబయ్య, రాజేష్, భాస్కర్, ఐలయ్య, రామలక్ష్మి, అఖిల, సునిత, అరుణ, శివకుమార్, సమ్మక్క, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

తగ్గించకుంటే ఆందోళనలు తప్పవు


మాట్లాడుతున్న చిలువేరు భిక్షపతి

ఆత్మకూరు : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించకపోతే ఆందోళనలు తప్పవని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరు భిక్షపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరను ఇష్టారీతిన పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తోందని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, విశ్వరత్న సమాజ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు పెండెల భిక్షపతి, నాయకులు జింక అశోక్, మాదాసి రాజు, పెండెల సారయ్య, కొమ్ము ఆనందం తదితరులు పాల్గొన్నారు.